క్లుప్తంగా

వెంకన్నకు వైభవంగా తులసి పూజ



అమలాపురం స్వామికి తులసి పూజ చేస్తున్న అర్చకులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామికి ప్రీతిపాత్రమైన రోజు శనివారం ఉదయం తులసి పూజ, అభిషేకాలు వైభవంగా జరిగాయి. దేవస్థానం ప్రధాన అర్చకుడు పెద్దింటి లక్ష్మీ నరసింహాచార్యుల ఆధ్వర్యంలో పండితులు ఈ క్రతువును నిర్వహించారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామానికి చెందిన దాతలు ఆకెళ్ల పార్వతీశం, రాజ్య కమల దంపతులు స్వామికి పూలతో ప్రత్యేక అలంకరణ చేయించారు. అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు, దేవస్థానం సిబ్బంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు.

మున్సిపల్ డీఈఈగా సత్యనారాయణ

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ డీఈఈగా కె.సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో డీఈఈగా పని చేసిన ఈయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ డీఈఈగా ప చేసి సీహెచ్ నాగ సతీష్ తుని మున్సిపాలిటీ డీఈఈగా బదిలీపై వెళ్లారు. ఇప్పుడు డీఈఈగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ గతంలో ఇదే మున్సిపాలిటీలో ఏఈగా 2022 వరకూ పని చేసి వెళ్లారు. తర్వాత ఆయన పదోన్నతిపై డీఈఈ అయ్యారు. గతంలో ఇదే మున్సిపాలిటీ ఏఈగా పని చేసిన అనుభవంతో డీఈఈగా ఇప్పుడు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలనని సత్యనారాయణ పేర్కొన్నారు.

ముమ్మిడివరం తహసీల్దార్‌గా సుభాష్



తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సుభాష్

ముమ్మిడివరం: స్థానిక తహసీల్దార్‌గా టి.సుభాష్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు అక్కడ తహసీల్దార్‌గా పని చేసిన ఎంవీ సుబ్బలక్ష్మి కాట్రేనికోన బదిలీ కావడంతో ఆమే స్థానంలో కోట నందూరు తహసీల్దార్‌గా పని చేస్తున్న టి.సుభాష్ బదిలీపై వచ్చారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ చినవలసల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం యూనిఫాంలు, పుస్తకాలను అందజేశారు. స్థానిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కొల్లు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు విద్యార్థి మిత్రకిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ అరదాడి సూరిబాబు, నాయకులు పెన్సింగి నాగబాబు, పాలెపు గోవరాజు, కామాడి వాసు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు కొత్త బాధ్యతలు

యానాం: పాండిచ్చేరి పోలీస్ సర్వీస్‌కు చెందిన సీనియర్ సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ ప్రవీణ్ కుమార్ త్రిపాఠీకి పుదుచ్చేరి క్రైమ్ అండ్ ఇంటిలిజెన్స్ బాధ్యతలను అప్పగిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన ట్రాఫిక్ బాధ్యతలను నిర్వర్తించారు. ఇటీవల కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ద్వారా పుదుచ్చేరిలో నియమితులైన ఐపీఎస్ అధికారి నిత్యా రాధాకృష్ణన్‌కు సీనియర్ సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్ఎస్‌పీ)గా నియమితులయ్యారు. మరో ఐపీఎస్ అధికారి అనిల్‌కుమార్‌లాల్‌కు పోలీసు ప్రధాన కార్యాలయం బాధ్యతలను అప్పగించింది. ఐపీఎస్ అధికారి అనితారాయ్‌ను ఇండియన్ రిజర్వుబెటాలియన్ కమాండెంట్‌గా నియమితులయ్యారు. ఆమెకు అదనంగా ఆర్మ్‌డ్ పోలీసు అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు.

'రీజెన్సీ'లో జాబ్ మేళా

యానాం: రీజెన్సీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఇంటర్‌పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులకు హైదారాబాద్‌లో వివిధ ఆసుపత్రుల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తులు కోరుతున్నామని శనివారం ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక రీజెన్సీ స్కూల్, జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రతి శని, ఆదివారాల్లో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. వివరాలకు రీజెన్సీ స్కూల్ హెడ్‌మాస్టర్, ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

కామిశెట్టి సావిత్రి వర్ధంతి

యానాం: మాజీ శాసన సభ్యురాలు కామిశెట్టి సావిత్రి వర్ధంతిని శనివారం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫ్రెంచి పాలనాకాలంలో 1959 నుంచి 1964 వరకు శాసన సభ్యురాలుగా పుదుచ్చేరి అసెంబ్లీలో కాలుమోపిన మొట్ట మొదటి మహిళగా సావిత్రిని పేర్కొంటారు. అదేవిధంగా యానాం మేయర్‌గా కూడా అమె సేవలందించారు. ఈ సందర్భంగా ఆమె సేవలు పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ, పీఆర్‌ఏ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయార్జన వేటలో మున్సిపాలిటీ

- సిద్ధమవుతున్న మున్సిపల్ షాపింగ్ మాల్
- గత ప్రభుత్వంలోనే రూ.3 కోట్ల నిధుల విడుదల
- నిర్మాణ పనులకు శ్రీకారం
- మాల్ రంగంలోకి అడుగిడుతున్న అమలాపురం మున్సిపాలిటీ



అమలాపురంలో నిర్మిస్తున్న సోషల్ అండ్ కల్చరల్ ఇనిస్టిట్యూషనల్ భారీ భవనం

అమలాపురం టౌన్: ఇంత వరకూ అమలాపురం పట్టణంలో ప్రైవేటుగా పలు రకాల షాపింగ్ మాల్స్ ఉన్నాయి. ఇప్పటికే పలు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లతో ఆదాయాన్ని ఆర్జిస్తున్న మున్సిపాలిటీ సరికొత్తగా మాల్స్ రంగంలోకి దిగుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ ఈ భారీ షాపింగ్ కాంప్లెక్స్‌కు రూ.3 కోట్ల నిధులు తెచ్చారు. 2023 సంవత్సరంలో ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి విశ్వరూప్ శంకుస్థాపన చేశారు. జీ ప్లస్ 4తో బహుళ అంతస్తుల భవనాన్ని ×సోషల్ అండ్ కల్చరల్ ఇనిస్యూషనల్‌¥ పేరుతో నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇప్పుడు ఈ భారీ భవనం 85 శాతం పనులు పూర్తి చేసుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్దే మెయిన్ రోడ్డును ఆనుకుని నిర్మిస్తున్న ఈ భారీ భవనం వల్ల మున్సిపాలిటీకి నెలనెలా దాదాపు రూ.5 లక్షల పైనే అద్దె వచ్చే అవకాశం ఉంది. మాల్ మాదిరిగా అన్ని వసతులతో భవనం రూపదిద్దుకుంటోంది. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఏదైనా ఒకే సంస్థకు లేదా ఫ్లోర్ల వారీగా అద్దెలకు ఇచ్చి ఆదాయాన్ని వడిసిపట్టేలా ఆలోచన చేస్తోంది. ఇప్పటికే పలు మున్సిపల్ పాపింగ్ కాంప్లెస్‌ల ద్వారా 102 షాపులతో దాదాపు ఏటా రూ.కోటి వరకూ ఆదాయం ఆర్జిస్తోంది.

కూటమి వచ్చి ఏడాది అవుతున్నా?

ఈ భవన నిర్మాణం 2023–24 సంవత్సరంలో వేగవంతంగా సాగింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం రావడం జరిగింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది అవుతున్నా ఈ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించేందుకు కొంచెం వెనకడుగు పడుతోంది. గత ప్రభుత్వంలో భవన నిర్మాణానికి పునాది రాయి పడిందనో, మరే ఇతర కారణంతోనో నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. తొలుత ఈ భవన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేసినప్పటికీ అదనపు పనులు నిమత్తం మున్సిపల్ ఇంజినీర్లు మరో రూ.90 లక్షలకు అంచనాలు రూపొందించి మున్సిపల్ శాఖకు పంపించారు. లిఫ్ట్, ఫ్లార్‌ల్లో గోడలు తదితర నిర్మాణాలకు ఈ అదనపు నిధులు వెచ్చించనున్నారు.

> **అదనపు నిధులు విడుదలైతే పనులు పూర్తిచేస్తాం**
>
> అదనపు నిధులు సాంకేతికంగా విడుదల కాగానే పనులు వేగిరం చేసి పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. నిధులు తొందర్లలోనే విడుదలయ్యే అవకాశం ఉంది. నిధులు రాగానే పనులు మొదలుపెట్టి త్వరలోనే భవనాన్ని అందుబాటులోకి తీసుకుని వస్తాం.
>
> – పి.వెంకటేష్, ఏఈ, అమలాపురం మున్సిపాలిటీ

ఒకే ఆధార్ నంబర్‌తో ఐదు విద్యుత్ కనెక్షన్లు

- ఆ కారణంతో తల్లికి వందనం నిలిపివేత
- లబోదిబోమంటున్న బాధితుడు

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ గంటా వీధికి చెందిన కర్రి కృష్ణమూర్తి ఆధార్ నంబర్‌తో ఐదు విద్యుత్ సర్వీసులు మంజూరు చేశారు. దీంతో ఆయన ఇద్దరు పిల్లలకు అందాల్సిన తల్లికి వందనం నిలిచిపోయింది.

దీనిపై లబోదిబోమంటూ కృష్ణమూర్తి విద్యుత్ శాఖ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో ఆయన పేరు మీద ఉన్న విద్యుత్ కనెక్షన్ల వివరాలను అధికారులు వివరించారు. ఆధార్ కార్డు నంబర్‌లో ముమ్మిడివరం మండలంలో అనాతవరం, కొత్తలంక, ముమ్మిడివరంలో మూడు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. తనకు తెలియకుండా తన ఆధార్ కార్డుతో ఐదు విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇచ్చారని కృష్ణమూర్తి ప్రశ్నిస్తున్నాడు. తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

మొక్కలు నాటిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్



మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

అమలాపురం టౌన్: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ వి.నిర్మల్ కుమార్ శనివారం సాయంత్రం నాటారు. అనంతరం కమిషనర్ నిర్మల్ కుమార్ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, ప్రజల చేత పర్యావరణానికి కట్టుబడి ఉంటామని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ కెవీవీ సత్యనారాయణ, పట్టణ ప్రణాళిక అధికారి బి.రాణి సంయుక్త, ఏఈలు వెంకటేష్, డీఎస్ భాస్కరరావు, రెవెన్యూ అధికారిణి భూపతి శ్రీలక్ష్మి, మున్సిపల్ వార్డు సచివాలయాలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య వృత్తిలో వాసు నాయక్ సేవలు ఆదర్శనీయం



డాక్టర్ వాసు నాయక్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, వైద్యులు

అమలాపురం రూరల్: వైద్య వృత్తిలో డాక్టర్ వాసు నాయక్ సేవలు ఎంతో మందికి ఆదర్శనీయమని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి కొనియాడారు. బండారులంక పీహెచ్‌సీ వైద్యాధికారిగా పని చేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లా పెదవడ్లపూడి పీహెచ్‌సీ బదిలీ అయ్యారు. ఎంపీపీ కార్యాలయంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 29 సంవత్సరాల పాటు వైద్య సేవలు అందించి ఎంతోమంది ప్రాణాలు కాపాడిన డాక్టర్ వాసు నాయక్ బదిలీ కావడం బాధాకరమన్నారు. ఎంపీడీవో బాబ్జీ రాజు, వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.సుమలత మాట్లాడుతూ వృత్తే ధ్యేయంగా భావించి అంకితభావంతో వైద్య సేవలు అందించిన డాక్టర్ వాసు నాయక్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ వాసు నాయక్ శాలువ కప్పి పూలమాలలతో ఘన సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఫణి కిరణ్, డాక్టర్లు అమృత, గౌతమి, శర్మ, అన్నామని, కే.శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, ఇందిరా శీతల, సర్పంచ్‌లు పెనుమాల సునీత, కరాటం రత్న ప్రసన్న, ఎంపీటీసీ దొంగ ఆంజనేయులు, సరెళ్ల రామకృష్ణ, చింతా శంకరమూర్తి, జాన గణేష్, అంకం పెదరాజు, సీహెచ్ఓ శేషుబాబు, సూపర్‌వేజర్ రాధా నర్సింహం, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. దేవాదాయ–ధర్మదాయ డీసీ, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో స్వామివారి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తైలాభిషేకాలు, పూజలు ద్వారా దేవస్థానానికి రూ.1,90,975, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.51,625తో కలిపి మొత్తం రూ.2,42,600 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ తెలిపారు.

విద్యుత్ సమస్యలతో ప్రజలు సతమతం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జానకి

ఉప్పలగుప్తం: ఎక్కువ సమయం విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో మండలం ప్రజలు, ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకీ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏవో బి.తులసీకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు హాజరై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జానకీ మాట్లాడుతూ ఈ వేసవిలో తాగునీటి సమస్యతో ప్రజలు చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు మాట్లాడుతూ ఎస్.యానం గ్రామంలో విద్యుత్ లైన్‌మన్ అందుబాటులో ఉండడంలేదని దీంతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిరోజు గృహాలకు అందించే విద్యుత్ సరఫరాను అంతరాయం కలిగిస్తూ ఆక్వా చెరువులకు అందించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ తొలకరి సాగుకు నీరందక ఇబ్బంది పడుతున్నారని, ప్రస్తుతం కూనవరం మేజర్ డ్రైన్ (మొగ ప్రాంతం) నుంచి సముద్రం ఉప్పునీరు మురుగు కాలువల్లోకి ప్రవేశిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయానికి వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు వారికి మద్దతు తెలుపుతూ మండలంలో ముంపుకు గురై పలు గ్రామాల్లో 2200 ఎకరాలు వరిసాగుకు అంతరాయం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, బద్రి బాబ్జి, పెయ్యిల రాజ్‌కుమార్, కుంచే బుల్లియ్య, యర్రంశెట్టి రామచంద్రరావు, జొన్నాడ శ్రీదుర్గ, చిక్కం జంగమయ్య, ఎంపీటీసీ సభ్యులు పెట్టా అప్పారావు, కొంకి ఏడుకొండలు, వంగా గిరిజాకుమారి, అంగాని అనంతలక్ష్మి, వరసాల వెంకటలక్ష్మి, నిమ్మకాయల రాము, కాట్రు ధనలక్ష్మి, తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, దోనిపాటి బాలమ్మ, సలాది సురేఖరాణి, షేక్ అహ్మద్ ఆలీషా, నీటి సంఘాల అధ్యక్షుడు నల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేంకటేశ్వరస్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు భారీ అన్నదానం చేశారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు సందడి చేశారు. స్వామికి వివిధ పూజల ద్వారా రూ.2,42,102 ఆదాయం లభించింది. స్వామివారి అన్నదాన ప్రసాదాన్ని 2900 మంది భక్తులు స్వీకరించారు.

పంట కాలువల పనుల తీరుపై రైతుల ఆందోళన



పటవలలో ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

తాళ్లరేవు: పటవల పంచాయతీలో పంట కాలువల్లో పనులు సక్రమంగా చేయకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని ఈబీసీ కాలనీకి వెళ్లే సౌత్ చానల్ పంట కాలువలో పూర్తిస్థాయిలో పూడికలు తీయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రజలకు తాగు, సాగునీటి అవసరాలకు ఈ కాలువ ఎంతో అవసరమని, ఇటువంటి కాలువను శుభ్రం చేయకుండా బిల్లులు మాత్రం వసూలు చేసుకున్నారని రైతులు ఆరోపించారు. ఈ కాలువలో ఉపాధి కూలీలతో పనులు చేయించారని, అయినప్పటికీ నీటి సంఘం ప్రతినిధులు మెషీన్లతో పని చేసినట్లుగా చూపించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇలా ఉండగా ప్రధాన పంట కాలువలకు నీరు విడుదల చేసినప్పటికీ తమ కాలువకు నీరు రాకుండా ఐరన్ డ్యామ్ నిర్మించి కాలువను మూసివేశారన్నారు. తమ కాలువకు నీరు రాకుండా చేసినందుకు ఆ ప్రాంతానికి చెందిన సుమారు 70 మంది రైతులు ఆ ఐరన్ డ్యామ్‌ను తీసి పక్కన పెట్టారన్నారు. దీనిని సాకుగా చూపి అవినీతిని ప్రశ్నించినందుకు కక్ష పూరితంగా జనసేన పార్టీ నాయకుడు కోసూరి రామారావుపై లేనిపోని కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. కక్ష సాధింపు చర్యలు మానుకోకుంటే ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు దృష్టికి తీసుకువెళతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు కె.సత్తిరాజు, బి.పార్థసారథి, సత్తిబాబు, విష్ణు, చక్రం, అప్పలరాజు, వెంకటరమణ, నాని తదితరులు పాల్గొన్నారు.

యోగా గురువు భైరవ స్వామికి సత్కారం



భైరవస్వామిని సత్కరిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: యోగా దినోత్సవం సందర్భంగా ఎందరికో విద్యా బుద్ధులతోపాటు యోగాసనాలు నేర్పిన 96 ఏళ్ల వయస్సు గల యోగా గురువు మోటూరి భైరవస్వామిని అమలాపురం వాకర్స్ క్లబ్ శనివారం ఘనంగా సత్కరించింది. భైరవస్వామి సొంతూరు అయిన అయినవిల్లి మండలం నల్లచెరువు గ్రామానికి వాకర్స్ క్లబ్ ప్రతినిధుల వెళ్లి ఆయనను సత్కరించి, యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వర ప్రసాద్, వాకర్స్ ప్రతినిధులు నూకల సత్యనారాయణ, గుర్రం రామకృష్ణ, పడాల నాయుడు, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, కడలి తాతారావు, వాసిరెడ్డి ఈసు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి సాయం

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.14,500 ఆర్థిక సాయం శనివారం అందజేశారు. ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామానికి చెందిన రంకిరెడ్డి దుర్గాప్రసాద్ (19) వారం రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది. రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. తలకి ఆపరేషన్ జరిగింది. ఇంకా కొన్ని రోజులు ఆస్పత్రిలో ఉండాల్సిన పరిస్థితి. ఆర్థికస్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో దుర్గాప్రసాద్ తండ్రి రంకిరెడ్డి సత్యనారాయణకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.14,500 చెక్కు అందజేశారు.

సంపద తయారీ కేంద్రాల ప్రారంభం

అయినవిల్లి: గృహ వ్యర్థాల నుంచి సంపదను సృష్టించి సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని సాధించడమే లక్ష్యంగా తద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయ మార్గంగా తీర్చిదిద్దడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శనివారం వెలువలపల్లిలో ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.22 లక్షలతో నిర్మించిన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

యోగా... ఒంటికి మంచిదేగా..

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- వాడవాడలా యోగాసనాలు



వీరేశ్వరస్వామి ఆలయం వద్ద యోగాసనాలు వేస్తున్న భక్తులు, దేవస్థానం అధికారులు

అమలాపురం టౌన్: యోగా ఒంటికి చాలా మంచిదని పలువురు వక్తలు, ప్రముఖులు అన్నారు. అంతర్జాతీయ యోగా అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా సాధన ప్రజల్లో చైతన్యం పెంచారు. అమలాపురం పట్టణంలోని పలు సంస్థలు యోగా శిక్షణా కార్యక్రమాలను శనివారం ఉదయం నిర్వహించాయి. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు యోగా గురువులు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం యోగా శిక్షణ పొందిన సభ్యులంతా ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుతోపాటు యోగా గురువులు గాదె వీర్రాజు, పట్నాల శ్రీను, యండమూరి సత్తిబాబులను ఘనంగా సత్కరించారు. స్థానిక డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఉద్యాన వనం (పార్కు)లో నిర్వహించిన యోగా శిక్షణా శిబిరంలో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి బి.రాణి సంయుక్త, ఏఈ వెంకటేష్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ ఆశెట్టి నాగ దుర్గ, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు యోగాసనాలు వేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఐఎంఏ భవనంలో యోగా శిక్షణా కార్యక్రమం జరిగింది. యోగా గురువు ఉషారాణి యోగాసనాలు వేయించారు. ఐఎంఏ కోనసీమ శాఖ అధ్యక్షుడు డాక్టర్ జె.శివకుమార్, కార్యదర్శి డాక్టర్ వైటీ నాయుడు తదితరులు యోగాసనాలు వేశారు.

ఐ.పోలవరం: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ యోగా సాధకులు, సంధ్యా గురుకులం స్టేట్ కో–ఆర్డినేటర్, ఆదర్శ యోగాచార్య అవార్డ్ గ్రహీత లక్ష్మీనారాయణ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దేవదాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో యోగా దినోత్సవం శనివారం మురమళ్ల వీరేశ్వర స్వామి వారి ఆలయంలో పెద్ద సంఖ్యలో యోగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో యోగా ఘనంగా జరిగింది. సుమారు 300 మంది పైగా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ కాలే రాజబాబు, ఉప సర్పంచ్ రాయపురెడ్డి మాణిక్యాలరావు, దాట్ల రామకృష్ణంరాజు, మాజీ చైర్మన్‌లు జంపన భీమరాజు, కఠారి రామ వెంకట సుబ్బరాజు, దాట్ల ఇంద్ర రాజు, ఆలయ అర్చకులు, పురోహితులు, వేద పండితులు ధార్మిక, కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సుంకరపాలెం సొసైటీ కార్యాలయం వద్ద మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, సుంకరపాలెం సర్పంచ్ టేకిళ్లపూడి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వలీబాబా, యూపీ స్కూల్ హెచ్ఎం కె.వెంకటలక్ష్మి, సునీల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఇంజరం గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ ముద్దన శివరామప్రసాద్ అధ్యక్షతన యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. తాళ్లరేవు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఎంపీడీఓ కె.సత్యనారాయణ కూటమి నాయకులు పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఉన్నత పాఠశాలల్లో శనివారం యోగా నిర్వహించారు. కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పౌరులు, విద్యార్థులు పాల్గొని యోగా ప్రదర్శించారు. గుడ్డివానిచింత,, బోడసకుర్రులో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యానాం: స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్‌స్టేడియంలో ప్రపంచ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని పుదుచ్చేరి ప్రభుత్వం, రీజినల్ అడ్మినిస్ట్రేషన్, ఆయుష్, పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు యోగా విన్యాసాలను వేశారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఏఓ మునిస్వామి, ఆయుష్ ప్రధానవైద్యాధికారి డాక్టర్ స్టాన్లీ స్టీవెన్‌సన్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. యానాం సబ్‌కోర్టులో కూడా యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీలో యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ పి.రవివర్మ ఆధ్వర్యంలో యోగా ట్రైనర్ రాంబాబు కార్యాలయ అధికారులు, సిబ్బంది నాయకులు యోగాసనాలు వేశారు. అనంతరం ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నీరు మీరులో నీటి లభ్యత–వినియోగం ,నీటి వృధాను వివారించడంపై అవగాహన కల్పించారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

అమలాపురం రూరల్: మండలంలో ప్రపంచ యోగా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ యోగా దినోత్సవం వేడుకల్లో ప్రముఖ యోగా ట్రైనర్, జి.దుర్గా ప్రసాద్ విద్యార్థులతో యోగాసానాలు వేయించారు.

కాట్రేనికోన: మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో యోగా దినోత్సవం జరుపుకొన్నారు. చెయ్యేరు, కాట్రేనికోన తదితర గ్రామాల్లో యోగాసాలు వేశారు.



యోగా గురువులతో పాటు ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరిస్తున్న దృశ్యం



అమలాపురం తామర చెరువు పార్కులో యోగాసనాలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, మున్సిపల్ అధికారులు



డాక్టర్‌వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో యోగా విన్యాసాలు



నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది, నాయకులు